

వైసీపీ హయాంలో ఆయన లీలలు అన్నీఇన్నీ కావు. చేసేది త్రిబుల్ స్టార్ పోలీసు ఉద్యోగమైనా.. డీఫ్యాక్ట్ ఎస్పీగా జిల్లాను శాసించారంటారు. ఒక విధంగా చెప్పాలంటే నాటి వైసీపీ పెద్దల అండతో అసాంఘిక శక్తులతో మిలాఖత్ అయి జూదం, వడ్డీ వ్యాపారం, సెటిల్‌మెంట్లు దౌర్జన్యాలు.. ఇలా ఒకటేంటి అన్నింట్లోనూ ఆ సారు చేయి పెట్టాడంటారు. ఆయన వేసుకున్నది ఖాకీ చొక్కా అయినప్పటికీ వైసీపీ నేతలకు నమ్మినబంటుగా మారి అడ్డగోలు పనులు చేశారంటారు. పోలీసువనంలో గంజాయి మొక్కలాంటి ఈ సారుపై.. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటారని అందరూ అనుకున్నారు. ఎనిమిదినెలలు కావస్తున్నా ఆయనపై చర్యలు లేకపోవడంతో.. ఆ సారు బాధితులే ఇప్పుడు బయటికి వచ్చి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారన్న సమాచారం మళ్లే హాట్‌టాపిక్‌గా మారింది.



- ఆయన త్రిబుల్ స్టార్ అధికారి మాత్రమే
- జగన్ హయాంలో డిఫ్యాక్ట్ ఎస్పీగా జిల్లాను శాసించిన వైనం
- నాటి వైసీపీ పెద్దల అండతో చెలరేగిన సారు
- అన్నింట్లోనూ ఆయనదే హవా
- అసాంఘిక శక్తులతో మిలాఖత్
- డబ్బే సంపాదనగా విధులు
- బిడికి సమీపంలో ఫాంహౌస్
- ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న బాధితులు

పోలీసువనంలో.. గంజాయి మొక్క..!

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఎస్పీగా అన్బురాజన్ సుదీర్ఘకాలం పనిచేశారు. ఆయన తరువాత సిద్ధార్థ కౌశల్ వచ్చారు. వారు పేరుకే ఎస్పీలు. ఈ త్రిబుల్‌స్టార్ పోలీసు పులివెందుల వైసీపీ బ్యాచ్, ఇతర కీలక నేతలతో మంచి సంబంధాలు ఏర్పరచుకుని ఈయనే ఒరిజినల్ ఎస్పీ అనేలా వ్యవహరించారు. జిల్లాలో సీఐలను, ఎస్ఐలను ట్రాన్స్‌ఫర్ చేయాలన్నా ఈయన గ్రీనసిగ్నల్ ఇవ్వాల్సిందే. అంతగా అధికార వైసీపీ పెద్దలను మేనేజ్ చేశారంటారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ సారు వీఆర్‌లో ఉన్నారు.

ఇప్పుడు కదలిక

వైసీపీ హయాంలో ఈ సారు ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. ప్రత్యర్థులపై అటాక్ చేయాలన్నా, హింసించి జైల్లో పెట్టాలన్నా, విలువైన భూములు లాక్కోవాలన్నా, అక్రమ కేసులతో సెటిల్‌మెంటు చేయాలన్నా ఈ సారు కింగ్ అని చెబుతారు. ఎన్నికల ముందు ఈయన అవినీతి దందాపై తొలిసారి టీడీపీ నేతలు బి.హరిప్రసాద్ ఇతరులు విరుచుకుపడ్డారు. ఇక అప్పట్లో బీటెక్ రవి కిడ్నాప్ వ్యవహారం సంచలనం రేగింది. దారికాచి మరీ బీటెక్ రవిని అదుపులోకి తీసుకుని, ముఖానికి ముసుగేసి తీసుకెళ్లి పాయింట్ బ్లాంక్‌లో తుపాకి బెట్టి బెదిరించారని అంటారు. ఇంతగా బరితెగించిన ఈయనపై కూటమి ప్రభుత్వం వస్తే చర్యలుంటాయని అందరూ అనుకున్నారు. అయితే ఇప్పటి దాకా ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలూ లేవు. దీంతో తననెవరూ ఏమీ చేయలేరని అనుకున్నారేమో ఈ సారు.. చిన్నచౌకులో తాను అధిక వడ్డీలకు డబ్బు ఇచ్చిన వ్యక్తి ఇంటిని తన బినామీ పేరుతో గురువారం రిజిస్ట్రేషన్ చేసుకున్నాడంటారు. ఈ వ్యవహారంతో అప్రమత్తమైన బాధితులు ఈ సారు లీలలు బయటికి తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మరి రాష్ట్ర ప్రభుత్వం, ఎస్పీ ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

ఇవీ సారు లీలలు..

- వైసీపీ హయాంలో జిల్లాలో జూదం విచ్చలవిడిగా సాగింది. నిర్వాహకులు రోజుకు రెండు లక్షలు ముట్టచెబితే ఆ ప్రాంతం వైపు పోలీసులు కన్నెత్తి కూడా చూడరు. అంతేకాక తన బినామీలతో ఏకంగా వడ్డీ వ్యాపారమే చేశారని ప్రచారం ఉంది.
- ఈ సారు చిన్నచౌకులోని ఓ కల్యాణమండపం వద్ద నివాసం ఉండే ఓ వ్యక్తికి అలవికాని వడ్డీలకు రూ.50 లక్షలు అప్పు ఇచ్చాడు. వడ్డీలు కట్టలేక చివరకు ఆయన ఊరొదిలి వెళ్లిపోయాడని అంటారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా ఒక వర్గం టీడీపీ నేతను హత్య చేసే ప్రయత్నం జరిగింది. ఓ యువకుడు హైదరాబాదులో పిస్తోలుతో పట్టుబడ్డాడు. ఆ టీడీపీ నేతను కడపలో చంపేందుకు సుపారి ఇచ్చారని హైదరాబాదుకు చెందిన కొందరు ఈ సారుకు సమాచారం ఇచ్చారంటారు. వెంటనే ఈ సారు అతన్ని తీసుకు వచ్చి తప్పుడు కేసు పెట్టి మరో వర్గం టీడీపీ నేతల నుంచి భారీగా గుంజారని ప్రచారం ఉంది.
- ఇక వైసీపీ నేత శ్రీనివాసరెడ్డిని ల్యాండ్ సెటిల్‌మెంట్లలో వచ్చిన ఆదాయం పంపకాలలో తలెత్తిన విభేదాల కారణంగా సొంత పార్టీ నేతలు హత్య చేశారు. ఇందులో టీడీపీ నేతపై కేసు నమోదు చేశారు. ఆయనను హైదరాబాదులో అదుపులోకి తీసుకున్నారు. ఆయనను కొట్టకుండా ఉండేందుకు సారు బాగానే డబ్బు తీసుకున్నారంటారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉన్న ఓ నేత ఈ సెటిల్‌మెంటు చేశారని చెబుతారు.
- హవాలా కేసులో సంబంధంలేని వ్యక్తిని తీసుకువచ్చి ఔటర్ రింగురోడ్డులోని సింగ్ గెస్ట్‌హౌస్‌లో నిర్బంధించి భారీగా లాగేసుకున్నారని చెబుతారు.
- ఎన్నికల ముందు దొంగ బంగారమంటూ కడపకు చెందిన ఓ వ్యక్తిని బెదిరించి భారీగా కొట్టేశారని ప్రచారం ఉంది.
- జాతీయ రహదారిలోని సీకేదిన్నె, రామాపురం మండలాల్లో కడప నగరానికి చెందిన ప్రముఖులకు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. ఈ సారుకు కూడా ఫామ్‌హౌస్ కావాలని కోరిక పుట్టింది. జాతీయ రహదారిలో ఉన్న బిడికి సమీపంలో సుమారు రెండు ఎకరాల పట్టాభూమిని బినామీ ద్వారా కొనుగోలు చేసినట్లు చెబుతారు. ఆ పక్కనే సుగాలి బిడికికి చెందిన ఓ నాయకుని కుటుంబం ఆధీనంలో ఉన్న 8ఎకరాల భూమిని దౌర్జన్యంగా లాక్కుని 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నారని చెబుతారు. అలా లాగేసుకున్న భూమిలో సారు ఫాంహౌస్ కట్టుకుని బాగా చిల్ అవుతున్నట్లు చెబుతున్నారు.

జిల్లాకు నీతి అయోగ్ పురస్కారం

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత జిల్లాలలో అత్యుత్తమ పని తీరు కనబరిచినందుకు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ ద్వారా అత్యుత్తమ పురస్కారం కింద రూ.3 కోట్లు కేటాయించిందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, నైపుణ్యాభివృద్ధి అనే అంశాల్లో ఫిబ్రవరి 2024 వరకు ఉత్తమ పనితీరు కనబరిచినందుకు జిల్లాకు ఈ పురస్కారాన్ని నీతి అయోగ్ ప్రకటించిందన్నారు. దేశ వ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36 జిల్లాలకు ఈ పురస్కారాన్ని ప్రకటించగా అవదులో మన జిల్లా ఒకటి కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆర్థిక అక్షరాత్యతను పెంపొందించడం, బ్యాంకింగ్ యాక్సెస్‌ను విస్తరించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంతో పాటు విస్తృతంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల ఈ పురస్కారం జిల్లాను వరించిందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర మిషన్‌లో కడపకు 7వ స్థానం

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర మిషన్ కార్యక్రమంలో కడప కార్పొరేషన్‌కు 118 పాయింట్లతో రాష్ట్రస్థాయిలో ఏడవస్థానం లభించింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై అధికారులు ముఖ్యమంత్రికి నివేదికలు సమర్పించారు. మొత్తం 14 ఇండికేటర్స్‌లు పెట్టారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్ టు డోర్ కలెక్షన్, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, క్లీన్ విలేజ్, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాల్లో ఆయా జిల్లాల్లో ప్రగతిపై సీఎంకు వివరించారు. వీటి ఆధారంగా జిల్లాకు 7వ స్థానం లభించింది.

స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలి

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనలో భాగంగా జిల్లాలోని గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డుమీటింగ్ హాల్లో ప్రతినెలా 3వ శనివారం తల పెట్టిన స్వచ్ఛ దివస్ కార్యాచరణపై కలెక్టర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులతో సమావేశమై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- లేదంటే చర్యలు తప్పవు : డిప్యూటీ కలెక్టర్

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లోని క్యాజువాలిటీలో వైద్యులు అందుబాటులో ఉండాలని లేదంటే చర్యలు తప్పవని డిప్యూటీ కలెక్టర్ మరియు ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు బయోమెట్రిక్ వేసి ప్రైవేట్ క్లినికల్‌లకు వెళుతున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవని అన్నారు. బయోమెట్రిక్ కచ్చితంగా పాటించాలని, పేషెంట్ శాటిస్ ఫ్యాక్షన్ శాతం పెరగాలని తెలిపారు. ప్రభుత్వ వైద్యులు డ్యూటీ సమయంలో తమ సొంత క్లినిక్‌లలో ఉన్నారా లేదా తెలుసుకోవడానికి ఆసుపత్రి ఉన్నతాధికారులతో సర్‌ప్రైజ్ విజిట్ చేస్తామన్నారు. ఈ విజిట్‌లో ఎవరైనా వైద్యులు దొరికితే వారిపైన చర్యలకు డీఎంఈకి సిఫారసు చేస్తామని తెలిపారు. కొంత మంది వైద్యులు ఈ సమావేశానికి గైర్హాజరు అయ్యారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎంఈకి పంపించామన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ప్రిన్సిపల్ సురేఖ, సీఎస్ఆర్ ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్ఎంఓలు, ఆరోగ్యశ్రీ సిబ్బంది, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

కడప కలెక్టరేట్/కడప క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్ర జ్యోతి): దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయనకు కలెక్టర్, ఎస్పీ ఘన నివాళి అర్పించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ శ్రీధర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేస్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకోసం జీవితాన్ని అంకితం చేసిన నిష్కళంక, నిస్వార్థ నిరాడంబర నేత దామోదరం సంజీవయ్య అని ప్రశంసించారు. దళిత కుటుంబంలో జన్మించి అత్యున్నత పదవులను అధిరోహించడం గర్వించదగ్గ విషయమన్నారు. కర్నూలుకు సమీపంలో పెద్దపాడు గ్రామంలో 1921లో జన్మించారన్నారు. 38 ఏళ్ల ప్రాయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పాలనలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. అలాగే.. స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి ఎస్పీ పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంజీవయ్య జీవిత ప్రస్థానం ఆద్యంతం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టడానికి, ప్రజల ఇబ్బందులు తొలగించడానికి ఏసీబీ వ్యవస్థను దేశంలోనే మొట్టమొదటసారిగా ఏపీలో స్థాపించారన్నారు.



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్ తదితరులు

యువతిపై యాసిడ్ దాడి

- ప్రేమికుల రోజున యువకుడి అఘాయిత్యం
- ప్రేమించలేదని.. మెడ, చేతిపై కత్తిపోట్లు
- ప్రాణాపాయ స్థితిలో యువతి
- ఉలిక్కిపడ్డ ప్యారంపల్లె
- బాధిత కుటుంబానికి నారా లోకేశ్ భరోసా



యాసిడ్ దాడిలో గాయపడిన గౌతమి (ఫైల్‌ఫొటో)

గుర్రంకొండ, ఫిబ్రవరి 14: ప్రేమికుల దినోత్సవం రోజున ఓ ప్రేమోన్మాది యువతిపై రాక్షసంగా ప్రవర్తించాడు. సమాజం తలదించుకొనేలా నోటిలో, ముఖంపై యాసిడ్ పోయడంతో పాటు కత్తితో శరీరంపై పలుచోట్ల పొడిచాడు. ఏడాదిగా యువతి వెంటపడుతూ ప్రేమించాలని పలు విధాలుగా ఇబ్బందిపెట్టాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు ఆ యువతికి తన బంధువుతో వివాహం జరిపించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రేమోన్మాది యువతి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో స్వగ్రామానికి వచ్చి తనను ప్రేమించాలని వేధించాడు. యువతి నిరాకరించడంతో వెంట తెచ్చుకొన్న యాసిడ్‌ను ఆమెపై పోయడమే కాకుండా కత్తితో పొడిచి పారిపోయాడు. ప్రస్తుతం ఆ యువతి పరిస్థితి విషమంగా ఉంది. ఈ అమానుష ఘటన గుర్రంకొండ మండలం ప్యారంపల్లెలో శుక్రవారం చోటుచేసుకొంది.

గుర్రంకొండ మండలం నడిమి ఖండ్రిగ పంచాయతీ ప్యారంపల్లెకు చెందిన టి.జనార్ధన్, రెడ్డెమ్మ దంపతులు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. వీరిలో మొదటి సంతానం టి.రాజేష్ కాగా రెండవ సంతానం గౌతమి(22). గౌతమి విద్యాభ్యాసం చాలా వరకు మదనపల్లెలో జరిగింది. తను డిగ్రీ పూర్తి చేసి బ్యూటీషియన్ కోర్సును అభ్యసించింది. మదనపల్లె పట్టణంలోనే ఉంటూ బ్యూటీషియన్ పనులు చేస్తుండేది. ఈ క్రమంలో యువతిని ఏడాదిగా మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట వైఎస్సార్ కాలనీకి చెందిన ఎస్.గణేష్ (24) ప్రేమించాలంటూ వేధిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి గౌతమి అంగీకరించలేదు. అతడు వెంటపడుతుండటంతో ఎవరికీ చెప్పలేక నరక యాతన అనుభ వించింది. ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చేసింది. తల్లిదండ్రులు గౌతమికి తన మేనత్త కుమారుడు శ్రీకాంత్‌తో ఈ నెల 7న నిశ్చితార్థం చేశారు. ఏప్రిల్ 29న వివాహం చేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రేమోన్మాది శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో ప్యారంపల్లెకు ద్విచక్ర వాహనంలో చేరుకున్నాడు. ద్విచక్ర వాహనాన్ని దూరంగా ఉంచి యువతి ఇంటి వద్ద తల్లిదండ్రులు లేని సమయం చూసి ఇంట్లోకి ప్రవేశించి డోర్ లాక్ చేశాడు. యువతి ప్రేమోన్మాదిని ప్రతిఘటించడంతో తన వెంట తెచ్చుకున్న బాటిల్‌లోని యాసిడ్‌ను ఆమె ముఖం, నోట్లో పోశాడు. కత్తితో మెడ, చేతిపై కోసి శరీరంపై అక్కడక్కడ పొడిచాడు. అనంతరం యువతి అరుపులు బయటకు వినపడకుండా డోర్ లాక్‌చేసి పారిపోయాడు. యువతి సెల్‌ఫోన్‌ను కూడా తీసుకెళ్లాడు. దీంతో బాధిత యువతి ఇంట్లో ఉన్న తన తల్లి సెల్‌ఫోన్ నుంచి తండ్రి జనార్ధన్‌కు ఫోన్ చేసి విషయం తెలిపింది. వెంటనే తల్లిదండ్రులు పొలం వద్ద నుంచి బంధువులు, కుటుంబ సభ్యులకు చెప్పి పరుగున ఇంటికి వచ్చారు. అప్పటికే ఆ యువతి అపస్మారక స్థితిలో ఉండడంతో కారులో గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం : మంత్రి మండిపల్లి



గాయపడిన యువతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎస్పీ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాది చేతిలో యాసిడ్ దాడిలో గాయపడిన గౌతమిని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబులు పరామర్శించారు. స్థానిక జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని శుక్రవారం మంత్రితో పాటు తంబళ్లపల్లె టీడీపీ నేతలు డి.జయచంద్రారెడ్డి కోపూరి మల్లికార్జుననాయుడులు పరామర్శించి, దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దాడి చేసిన నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, నిందితున్ని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. ప్రభుత్వం తరపున గౌతమికి మెరుగైన చికిత్స అందిస్తామని ప్రకటించారు. అంతకుముందు మంత్రి నారా లోకేష్, మండిపల్లెతో ఫోన్‌లో మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాగా నిందితుడిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గుర్రంకొండ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పోలీసుశాఖ పట్ల విశ్వసనీయత పెంచండి

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వహించాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. డీజీపీ ఆదేశాలు క్షేత్రస్థాయి సిబ్బందికి తెలపాలన్నారు. పెండింగులో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. చైన్ స్నాచింగ్‌లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పోస్టర్లు రూపొందించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించాలన్నారు. పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టాలని, మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

● ఆశీస్సులు



కడపలోని మేడా కల్యాణమండపంలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, సాయిబాబా విద్యాసంస్థల సీఈవో ఎంవీ శ్రీదేవిల కుమారుడు సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మిమౌనిక వివాహ రిసెప్షన్‌కు హాజరై ఆశీర్వదించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కల్యాణం.. నయనానందకరం



విజయదుదుర్గాదేవి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దుర్గాప్రసాద్ దంపతులు

కడప నగరంలోని బిల్టప్ సమీపాన ఉన్న విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణం నయనానందకరంగా సాగింది. అనంతరం అమ్మవారికి నగరోత్సవం నిర్వహించారు.



తాగేందుకు రూ.700 ఇవ్వలేదని..

సుత్తితో కొట్టిచంపిన భర్త

- పోలీసుల అదుపులో నిందితుడు



మృతురాలు జమీల (ఫైల్)

కడప క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసిన భర్తే.. ఆమెకు కాలయముడయ్యాడు. మద్యం అలవాటుతో తరచూ భార్యను వేధిస్తూ.. తాగేందుకు రూ.700 డబ్బులు ఇవ్వలేదని చివరికి భార్యనే కడతేర్చాడు. ఈ విషాద సంఘటన కడప నగరంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు..

ప్రొద్దుటూరుకు చెందిన పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ కొన్ని నెలల క్రితం కడపకు చేరుకుని బెల్లమండీవీధిలోని చిన్నమునిరావువీధిలో నివాసం ఉంటున్నారు. ఇతను ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 11 ఏళ్ల క్రితం పఠాన్ జమీలా(30)తో వివాహం జరిగింది. వీరికి షాహిదా ఖానం(9), ఎజాజ్ ఖాన్(7), ఆలీనాఖాన్ (5) పిల్లలున్నారు. ఇమ్రాన్‌ఖాన్ మద్యానికి బానిస కావడంతో పాటు తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. గురువారం పని ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చిన ఆయన రూ.700 భార్య చేతికి ఇచ్చాడు. ఆమె రూ.200కు కూరగాయలు కొని ఇంటి అద్దె కోసం మరికొంత నగదును ఎత్తిపెట్టింది. బయటికి వెళ్లిన భర్త మద్యం సేవించి అర్ధరాత్రి తిరిగి ఇంటికి వచ్చాడు. తాను ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలంటూ భార్యను అడిగాడు. ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగి పెద్ద గొడవగా మారింది. దీంతో ఇమ్రాన్‌ఖాన్ భార్య తలపై తన వద్ద ఉండే సుత్తితో గట్టిగా బాదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్ఐ హుసేన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. కాగా.. జమీలాను భర్త హత్య చేయడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు.

బాలింతపై భర్త దాడి

అదనపు కట్నం కోసం వేధింపులని ఫిర్యాదు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఒక బిడ్డకు తల్లి అయినా ఇంకా అదనపు కట్నం కావాలని మునగపాటి సాహితిపై ఆమె భర్త నాగమళ్ల హరీష్ దాడి చేశాడు. దాడి సమయంలో బయటి నుంచి ఎవరూ రాకుండా అత్త నాగమల్ల శారద అడ్డుగా నిలిచింది. సాహితి వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాల్లోకెళితే.... గతేడాది నాగమళ్ల హరీష్‌కు మార్చి 22న సాహితితో వివాహమైంది. వివాహం సందర్భంగా ఏడు లక్షల రూపాయలు నగదు, 14 తులాల బంగారం ఇచ్చారన్నారు. వివాహమైనప్పటి నుంచీ కొద్ది రోజులు అన్యోన్యంగా వున్నట్లు తెలిపారు. తల్లి మాటలు విని తన భర్త తనను తరుచూ కొడుతున్నట్లు, అదనపు కట్నం తెమ్మని వేధిస్తూ వుండే వాడన్నారు. ఫిబ్రవరి 8న తను ఆడబిడ్డను ప్రసవించినట్లు తెలిపింది. గురువారం పుట్టింట్లో ఉండగా తన భర్త హరీష్ ఇంటి తలుపులు తన్నుకుంటూ వచ్చి అకారణంగా తనను దుర్భాషలాడుతూ బాలింత అని కూడా చూడకుండా దాడిచేశాడని వివరించింది. అక్కడే వున్న తన పిన్ని కొడుకు వంశీక్రిష్ణను చెవిమీద, పిన్నిని కాలితో కొట్టినట్లు తెలిపింది. తన తల్లి వెంకట రంగమ్మపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇంట్లో వున్న టీవీని పగుల కొట్టినట్లు తెలిపింది. ఇంట్లో ఈ సంఘటన జరుగుతుంటే ఇరుగు పొరుగు రాకుండా అత్త నాగమల్ల శారద బయటే ఉండి వచ్చేవారిని వారించింది సాహితి చెల్లెలు మునగపాటి సుజన ఈ దాడిపై భయపడి బయటికి వెళ్లి పెద్దమనుషులు డాక్టర్ రంగయ్య, సాంబశివారెడ్డిని పిలిచుకుని వచ్చింది. వారు వచ్చి నాభర్త హరీష్‌ను మందలించి పంపించేరు. గాయపడిన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి : జేసీ



రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కలకడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో ప్రజలు అందజేసిన ఆర్జీలను త్వరగా పరిష్కరించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కలకడ మండలం గుడిబండ పంచాయతీ చొక్కన్నవారిపల్లెలో జరుగుతున్న రీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే గురించి పట్టాదారులకు ముందస్తు సమాచారంపై తహసీల్దార్‌ను ఆరాతీశారు. భవిష్యత్‌లో రైతులకు ఎలాంటి భూ సమస్యలు తలెత్తకుండా హద్దులు నిర్ణయించాలని సూచించారు. పీజీఆర్ఎస్ పోర్టల్ ద్వారా అందిన ఆర్జీల పురోగతిపై సమీక్షించారు. అనంతరం పట్టాదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, డీటీ భార్గవి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

డీపీఓలో ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తొలి దళిత, ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఏఓ కృష్ణుడు, దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య తెలుగు జాతి గర్వించదగ్గ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దామోదరం సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడులో మునెయ్య, సుంకులమ్మ దంపతులకు జన్మించారని, 1935లో కర్నూలు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో చేరి 1938లో ఎస్ఎస్ఎల్‌సీ జిల్లాలోనే ప్రథముడిగా ఉత్తీర్ణుడయ్యారన్నారు. రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య సంయుక్త మద్రాసు రాష్ట్రం సహా రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో అనేక మంత్రి పదవులను నిర్వహించారన్నారు. 38 ఏళ్ల అతిపిన్న వయస్సులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, జాన్‌జోసెఫ్, పెద్దయ్య, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీసులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రామాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కారు స్కూటీని ఢీకొనడంతో దగ్గుపాటి పెద్ద రెడ్డెయ్య (67) మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘటనపై ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి కథనం మేరకు వివరాల్లోకెళితే.... రామాపురం మండలం కమ్మపల్లెకు చెందిన దగ్గుపాటి పెద్దరెడ్డెయ్య శుక్రవారం తెల్లవారు జామున భార్యతో కలిసి స్కూటీపై స్వగ్రామానికి వస్తూ, బండపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. రామాపురం పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాయచో టి ప్రభుత్వాస్పత్రికి తరలించగా. చికిత్స పొందుతూ పెద్దరెడ్డెయ్య మృతి చెందాడు. భార్యను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాంకేతిక కారణాలతో రైలు ఆలస్యం

సిద్ధవటం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కనుమలోపల్లె రైల్వే ట్రాక్‌పై శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతి నుంచి నంద్యాలకు వెళుతున్న డెమో ఎక్స్‌ప్రెస్ ఇంజన్ సాంకేతిక కారణాలతో నిలుపుదల చేశారు కడప నుంచి మరో ఇంజన్‌ను తెప్పించి పంపించామని రైల్వే సిబ్బంది తెలిపారు.

నందలూరులో స్టాపింగ్ ఇవ్వండి

నందలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే స్టేషన్‌లో రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని నందలూరు రైల్వేస్టేషన్ కన్సెలేటివ్ మెంబర్ రాచూరి మురళి శుక్రవారం సికింద్రాబాద్‌లో సౌత్‌సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ సిటీ ప్యాసింజర్ ప్రారంభించాలని, వెంకటాద్రి, చెన్నై సూపర్ ఫాస్ట్, ముంబై సీఎస్ఎంటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు నందలూరు రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

మార్చి1 నుంచి 20 వరకు పరీక్షలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాటల్లపై డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కమిషనరు మనోజ్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన పరీక్షల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూనియర్, సీనియర్ ఇంటర్ అభ్యర్థులకు మార్చి1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 64 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. అన్ని ప్రైవేట్ కళాశాలల్లో సీసీ కెమెరాలను తప్పక అమర్చాలన్నారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆర్ఐఓ వెకటసుబ్బయ్య విద్యాశాఖ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్యతదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. ఆదాయం బాగు

- నాలుగు ఎకరాల్లో 40 రకాల పంటలు
- ఐదేళ్లుగా 28 దేశాల శాస్త్రవేత్తలు రాక
- ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు



ప్రకృతి వ్యవసాయ పద్దతులలో సాగు చేసిన కూరగాయల పంట

వాల్మీకిపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులతో పెట్టుబడులు పెట్టి నష్టాలను చవిచూసిన ఓ మహిళా రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపి పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచారు. మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన స్వాతి, రాజారెడ్డి దంపతులు తొమ్మిదేళ్లగా ప్రకృతి వ్యవసాయంతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. గ్రామంలో ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ పొలాల్లో 40 రకాలకు పైగా పంటలు సాగు చేసి దిగుబడులను రాబడుతున్నారు. రసాయనిక ఎరువులను పూర్తిగా నిషేధించారు. ఎర్ర ఇసుక నేలల్లో వ్యవసాయ విధానం మంచి ఫలితాలనే ఇస్తోంది. తక్కువ పెట్టుబడులతో విభిన్న రకాల పంటలు సాగు చేస్తూ మంచి లాభాలనే గడిస్తున్నారు. సాగు చేసిన పంటలు సమీప ప్రాంత రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా శ్రీకారం చుట్టారు. ఇంటర్మీడియేట్ చదువుకున్న మహిళా రైతు స్వాతి ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. నాలుగెకరాల్లో సాగు చేసిన పంటలు ఏమాత్రం నష్టాల బాట పట్టకుండా తమదైన శైలిలో పర్యవేక్షిస్తూ సాగు పద్ధతులను వృద్ధి చేసుకుంటున్నారు.



ప్రకృతి వ్యవసాయ పంటలు పరిశీలిస్తున్న విదేశీ శాస్త్రవేత్తలు (ఫైల్)

ప్రకృతి వ్యవసాయంలో పండించే పంటలు

ప్రకృతి వ్యవసాయం ద్వారా మిరప, ఉల్లి, అలసంద, బెండ, జామ, కొత్తమీర, మెంతులు, చుక్కాకు, ముల్లంగి, బంతి, మొక్కజొన్న, టమోటా, కాకర, బీర, గోరుచిక్కుడు, వంగ, అల్లనేరేడు, ఆముదం, గోంగూర, ఆవాలు, దోస, కీరదోస, బొప్పాయి ఇలా 40కి పైగా వివిధ రకాల పంటలు ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తుండడం గమనార్హం.

పంటల కోసం జీవామృతం..

పశువుల పేడ, మూత్రము, బెల్లం, పప్పుదినుసుల పిండి, పుట్టమట్టితో జీవామృతం చేసుకుని తద్వారా ముందుగా దుక్కిలో 400 కిలోల ఘనజీవామృతం వేసి దుక్కి చేసుకోవడం, బీజామృతంతో నారు, విత్తనాల శుద్ధి, ప్రతి 15 రోజులకు ఒకసారి 400 లీటర్ల ద్రవ జీవామృతం పిచికారీ చేయడం, 200 లీటర్ల నీమాస్త్రంను, 20 లీటర్ల దశకర్ణి, 200 లీటర్ల పుల్లటి మజ్జిగను పిచికారీ చేసి తయారు చేసుకుంటారు. పంటల్లో పురుగుల నివారణకు 15 పసుపు, 10 బ్లూ ప్లేట్లు, 8 లింగాకర్ష బుట్టలు, 6 పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకుంటారు. అంతర పంటలుగా బంతి, మొక్కజొన్న సాగు చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

వాల్మీకిపురంలో ప్రత్యేక స్టాల్స్..

ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను వాల్మీకిపురం మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట ప్రతి సోమవారం స్టాల్స్ ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయలు తదితరం విక్రయిస్తుంటారు. అలాగే వారంలో జరిగే సంతలకు, అంగన్వాడీ కేంద్రాలకు కూరగాయలు అందిస్తుంటారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గి పంటలో దిగుబడి రావడమే కాకుండా భూమి సారవంతంగా వచ్చేందుకు తోడ్పడుతున్నారు. రసాయన వ్యవసాయం చేసి తీవ్రంగా నష్టపోయిన తమకు ప్రకృతి సాగు లాభిస్తోందన్నారు. ఐదేళ్లగా వివిధ దేశాల శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాల రైతులు, ఉద్యానవన, వ్యవసాయ అధికారులు అయ్యవారిపల్లె గ్రామ సమీపంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడం గమనార్హం.



ప్రతి సోమవారం ఏర్పాటు చేసే ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్స్

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి



రసాయన వ్యవ సాయం ద్వారా నష్టాలు తప్ప పెట్టుబడులు రాబట్టుకునే పరిస్థితులు కనుమరుగయ్యాయి. సులభతరమైన ప్రకృతి వ్యవసాయం ప్రతి రైతు చేయగలిగితే నష్టాల మాటే ఉండదు. రైతుకు తనకున్న పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయడం ఎన్నో లాభాలను తెచ్చి పెడుతుందనడంలో సందే హం లేదు. 9 ఏళ్ల కాలంగా ప్రకృతి వ్యవసా యం చేస్తున్నా ఏనాడు నష్టాల బాధలు పడలేదు.

\- స్వాతి, మహిళా రైతు, అయ్యవారిపల్లె

మహిళా రైతుకు చంద్రబాబు అభినందన

ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న మహిళా రైతు స్వాతి 2018లో సీఎం చంద్రబాబు ద్వారా సన్మానం, అభినందనలు అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో 3 నెలల డిప్లమో కోర్సు పూర్తి చేసిన స్వాతికి కిసాన్‌మేళా, పాలేకర్ శిక్షణ ద్వారా ప్రశంసాపత్రాలు, మహిళా రైతు, ఉత్తమ మహిళా రైతు అవార్డులు సొంతం చేసుకున్నారు.

అభివృద్ధే పూర్వవిద్యార్థి తపన





పాఠశాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న శకుంతులమ్మ - పాఠశాల నూతన భవనం

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలనే తపనతో ఉన్నత శిఖరాలకు చేరుకున్న పూర్వవిద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో ప్రాథమిక పాఠశాల నూతన భవ నానికి నోచుకుంది. వివరాల్లోకెళితే...

కర్ణాటక సరిహద్దుగా ఉన్న టి.సదుం పంచాయతీ రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉంది. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో అభివృద్ధిపై గ్రామస్థులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకోలేదు. 30 ఏళ్ల కిందట రామాపురం వాసి శకుంతలమ్మ చదువుకున్నారు. ప్రస్తుతం ఆమె మంచి ఉన్నత స్థానంలో ఉన్నారు. ఇటీవల తమ స్వగ్రామం రామాపురానికి వచ్చిన ఆమె తాను చదివిన పాఠశాల భవనం చూసి మనసు ద్రవించి పోయింది. వెంటనే శకుంతలమ్మ పాఠశాలకు వెళ్లి అక్కడ శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని చూసి నూతన భవనం నిర్మించాలని అనుకున్నారు. తమ గ్రామస్థులైన తనతో పాటు చదువుకున్న విద్యార్థులను కొందరిని పోగు చేసి పాఠశాల భవనం గురించి వారికి వివరించారు. తనతోపాటు తన స్నేహితుల సహకారంతో సుమారు రూ.5లక్షలు వెచ్చించి విద్యార్థులకు చక్కటి పాఠశాల భవనాన్ని నిర్మించారు. అందరి సహకారంతో నిర్మించిన పాఠశాలను శుక్రవారం ఎంఈఓ నారాయణ ప్రారంభించారు. పాఠశాల భవనాన్ని అన్ని వసతులతో నిర్మించిన దాత శకుంతలమ్మ సహా పలువురు విద్యార్థులు, గ్రామస్థులను అభినందించారు. దాతల సహాయ సహకారాలతో నిర్మించిన పాఠశాలలో నేటి విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలకు వెళ్లి అందరికీ ఆదర్శప్రాయంగా నిలవాలని ఎంఈఓ సహా పలువురు వక్తలు సూచించారు. కార్యక్రమంలో ములకల చెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయురాలు తేజశ్రీ, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమానాలు నడపండి

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అనుమతి కల్పించాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి న్యూ డిల్లీలో తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలసి కువైట్ రాయబారి మేషల్ ముస్తాఫ అల్ షేమలికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని ప్రజలు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలైన కువైట్, కత్తర్, దుబాయ్, సౌదీ దేశాలకు వెళ్లాలంటే పక్క రాష్ట్రం చెన్నై వెళ్లాలన్నారు. ఈ సమస్యకు పరిష్కారం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం ఒకటే మార్గం. తిరుపతి అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన టెర్మినల్ ఏర్పాటు చేసినా ఇంకా పూర్తి స్థాయిలో విమానాల రాకపోకలు ప్రారంభించలేదన్నారు. తిరుపతి అంతర్జాతీ య విమానాశ్రయంలో గల్ఫ్ దేశాలకు రాకపోకలు ప్రారంభించాలని కోరారు.

'సహజ సౌందర్యానికి' ఆంక్షల బ్రేక్



- బోసిపోతున్న... హార్సిలీహిల్స్
- యువతను హడలెత్తిస్తున్న తనిఖీలు
- బాగా దెబ్బతిన్న టూరిజం.. ప్రైవేట్ బిజినెస్
- టోల్‌గేట్‌ను వదిలేసిన కాంట్రాక్టర్

బి.కొత్తకోట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి)

కదలాడే మేఘాల సౌందర్యం.. కనువిందుచేసే ప్రకృతి సోయగం.. పరవశింప జేసే గంధపు గాలుల పరిమళం.. మండు వేసవిలో సైతం మైమరిపించే శీతల వాతావ రణం హార్సిలీహిల్స్ సొంతం. ఆంధ్రా ఊటీగా పేరుగాంచి, సముద్రమట్టానికి 4212 అడుగుల ఎత్తులో వుండి... జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అన్నమయ్య జిల్లా, బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ నేడు పర్యాటకులు లేక బోసిపోతోంది. పర్యాటకుల ఆక ర్షణ, అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌షిప్ కమిటీ ప్రేక్షకపాత్ర పోషిస్తుండడం, పర్యాటక శాఖ నిధులు కేటాయించక పోవడం ఒక కారణమైతే, తాజాగా అధికారులు తీసుకునే చర్యలు పర్యాటకులను దూరం చేస్తున్నట్లు ప్రచారం. ఫలితంగా ఉపాధి కోల్పోయి వందల మంది రోడ్డున పడ్డారు.



హార్సిలీహిల్స్ దిగువ భాగంలో పోలీస్ చెక్‌పోస్ట్

అవుట్‌పోస్ట్‌తో యువత హడల్

మదనపల్లె, అంగళ్లు వద్దనున్న ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీ విద్యార్థులు, వారాంతంలో బెంగళూరు నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కదిరి, రాయచోటి, చింతామణి తదితర ప్రాంతాల నుంచి హార్సిలీహిల్స్‌కు పెద్దసంఖ్యలో యువతీ యువకులు చేరుకుని సందడి చేస్తుంటారు. బ్యాచ్‌లుగా కొందరు, జంటలుగా కొందరు ద్విచక్రవాహనాల్లో వచ్చి సరదాగా గడుపుతారు. హిల్స్ ఘాట్‌రోడ్డులో కేరింతలు కొడుతూ, సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ ఎంజాయ్ చేసి కొందరు తిరుగుముఖం పడితే, మరికొందరు బుక్ చేసుకున్న అతిథిగృహాల్లో బసచేసి మరుసటిరోజు వెళ్లేవారు. దీంతో ఘాట్‌రోడ్డు మలుపులు, కొండపైనున్న వ్యూ పాయింట్ యువత సందడితో కళకళలాడేవి. కొంతకాలంగా ఈ సరదాలకు ఆంక్షల రూపంలో బ్రేక్ పడింది. బి.కొత్తకోట పోలీసులు కొండ దిగువ భాగంలో అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి, పైకి వెళ్లే ప్రతి వాహనాన్నీ ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎవరొచ్చినా వారి వారి ఐడీ ప్రూఫ్‌లు అడగడం, వారి ఇళ్లకు ఫోన్‌లు చేస్తుండడంతో యువత హడలెత్తి హార్సిలీహిల్స్‌కు రావడం మానుకుని ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. యువతీ యువకులను అనుమతించక పోవడంతో కొన్ని కుటుంబాలు మాత్రమే హిల్స్‌ను సందర్శిస్తున్నారు.

బాగా దెబ్బతిన్న బిజినెస్...

పర్యాటకుల రాక తగ్గడంతో ఏపీ టూరిజం అతిథి గృహాలు, బార్ రెస్టారెంట్, అటవీశాఖ ప్రాంగణంలో బిజినెస్ బాగా తగ్గినట్లు సిబ్బంది చెబుతున్నారు. కొండపై చిన్నా, చితక వ్యాపారాలతో జీవనం సాగించే కుటుంబాలు బావురుమంటు న్నాయి. పర్యాటకులను కింది నుంచి పైకి తరలించే ప్రైవేటు వాహనదారులు ఉపాధి కోల్పోయారు. అప్పటి ఆదాయంలో పాతికభాగం కూడా లేదంటున్నారు.

టోల్‌గేటును వదులుకున్న కాంట్రాక్టర్

వాహనాలను కొండమీదకు అనుమతించే టోల్‌గేటుకు టౌన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తారు. ఈ ఏడాది రూ.46లక్షలకు ఓ వ్యక్తి పాడుకున్నాడు. ఆదాయం వచ్చే కీలక సమయాల్లో ద్విచ క్ర వా హ నా ల న ు, ఆటోలను అనుమతించక పోవడం, ప్రస్తుతం యువత రాకపై ఆంక్షలు విధించడంతో ద్విచక్రవాహనాల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఫలితంగా భారీ నష్టాలు తప్పవని భావించిన కాంట్రాక్టర్ టోల్‌గేట్‌ను వదులుకున్నాడు. ప్రస్తుతానికి వచ్చే అరకొర వాహనాలకు రెవెన్యూ సిబ్బందే రుసుము వసూలు చేయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల సంఖ్య సాధారణ స్థితికి వచ్చేలా చూడాల్సి వుంది.



హిల్స్‌పై ఖాళీగా వున్న ఫారెస్ట్ క్యాంపస్



జనం లేక బోసిపోతున్న హార్సిలీహిల్స్ ప్రధాన సర్కిల్

కరెంటు వైర్లే వారి టార్గెట్



- అప్రమత్తంగా లేకుంటే అంతే..
- కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లలో చోరీలు
- పోలీసుల నిఘా అంతంత మాత్రమే

కడప క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు కడప నగరంలో కొత్తరకం చోరీలు జరుగుతున్నాయి. నూతనంగా నిర్మించిన.. నిర్మిస్తున్న ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్ప డుతు న్నారు. ఇళ్లలో కొత్తగా వైరింగ్ చేసిన రాగి వైర్లను చోరీ చేస్తున్నారు. ఆ వైరును కాల్చి రాగితీగను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి దొంగ తనాలపై బాధితులు పోలీసులను ఆశ్రయించలేకపోతున్నారు.

కడప నగర శివార్లలో ఉన్న వెంచర్లు, జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను టార్గెట్ చేసుకుంటారు. వైరింగ్ కనెక్షన్లు, శానిటైషన్ పనులు జరుగుతున్న ఆ ఇళ్లపై పక్కాగా రెక్కీ నిర్వహించి... రాత్రుళ్లు అక్కడ ఎవరూ లేని సమయంలో వైర్లను పైపుల్లో నుంచి మొత్తం లాగి తీసుకెళుతున్నారు. ఇలాంటి దొంగతనాలు నగరంలో తరచూ జరుగుతున్నాయి. అయితే బాధి తులు కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే మరికొందరు విద్యుత్ వైర్లే కదా అని వదిలేస్తున్నారు.

పులివెందుల రోడ్డులోని కొన్ని ఏరియాల్లో నూతనంగా ఇళ్లనిర్మాణాలు చేపట్టారు. ఓ వ్యక్తి కరెం టు కనెక్షన్ లాగేందుకు పైపుల్లో వైర్లను లాగి ఆ ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లాడు. అయితే ఇం టి తాళాలు పగలగొట్టకుండానే మెయిన్ పైపుల ద్వారా వైర్లు మొత్తం లాగేసుకుని అపహరించా రు. ఇదే తంతు చుట్టుపక్కల కూడా జరగడంతో చేసేదేమీలేక మరోమారు వైరు కనెక్షన్‌ను ఇచ్చుకున్న పరిస్థితి. అలాగే రామాంజనేయపురంలో టిడ్కో జగనన్నకాలనీలో కూడా తరచూ ఇలాంటి దొంగతనాలే జరుగుతున్నాయి.

మైనర్లతోనే చోరీలు

కొంత మంది మైనరు యువకులు మత్తుకు అలవాటు పడి డబ్బులు కోసం ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మైనర్లు కావడం తో వారిపై ఎలాంటి కేసులు ఉండవనే ఉద్దేశ్యంతో కొంత మంది వీరిని ఉపయోగించుకుని ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలించిన వైరులోని కాపర్, సిల్వర్ తీసుకుని గుజిరి వ్యాపారు లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

కొరవడుతున్న నిఘా

నూతన భవన నిర్మాణాల్లో కరెంటు వైర్ల దొంగతనాలపై పోలీసులు నిఘా అంతంత మాత్రమే ఉంది. అలాగే ఇంటి నిర్మాణ యజమానులు సైతం భవన నిర్మాణ సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నప్పటికీ వారు కూడా తాళాలు వేసుకుని వెళుతుండడంతో.. రాత్రి సమయంలో చోరీకి పాల్పడుతున్నారు. అక్కడ వాచ్ మెన్ కానీ, ఇంటిలో కాపలా ఎవరైనా ఉంటే ఇలాంటి చోరీలు జరగకుండా నివారించవచ్చు.

విశ్వనాథ్ కుటుంబానికి ఆదానీ కంపెనీ రూ.15 లక్షల పరిహారం

- సబ్‌కాంట్రాక్టర్ రూ.8లక్షలు, ఎమ్మెల్యే కుటుంబసభ్యులు రూ.3లక్షలు అందజేత



విశ్వనాథ్ తండ్రి బలరామయ్యకు రూ.15లక్షల చెక్కును అందజేస్తున్న ఆదానీ కంపెనీ ప్రతినిధులు

కొండాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్ కింద పడి మృతి చెందిన మండలంలోని తిరుమలాయపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్ కుటుంబానికి ఆదానీ కంపెనీ రూ.15లక్షలు చెల్లించింది. కంపెనీ ప్రతినిధులు శుక్రవారం రూ.15లక్షల చెక్కును తండ్రి బలరామయ్యకు అందజేశారు. పరిహారం చెల్లించాలంటూ విశ్వనాథ్ కుటుంబంతో పాటు తిరుమలాయపల్లె గ్రామస్థులు గురువారం ఆదానీ కంపెనీ వద్ద విశ్వనాథ్ మృతదేహంతో ఆందోళనకు దిగారు.

ఈ నేపథ్యంలో ఆదానీ కంపెనీ దిగి వచ్చింది. దీంతో రూ.15లక్షల పరిహారంతో పాటు భవిష్యత్తులో విశ్వనాథ్ అక్కకు ఆదానీ కంపెనీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చినట్లు విశ్వనాథ్ బంధువులు తెలిపారు. అదేవిధంగా కంపెనీ సబ్ కంట్రాక్టర్ చెన్నారెడ్డి రూ.8లక్షలు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులు రూ.3లక్షలు విశ్వనాథ్ తండ్రి బలరామయ్యకు అందజేశారు. తమ కుటుంబానికి న్యాయం జరగడానికి సహకరించిన తిరుమలాపల్లె గ్రామస్తులు, మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డికి విశ్వనాథ్ తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.

పీజీ విద్యార్థులకు నూతన సిలబస్ రూపకల్పన



బీఓఎస్ చైర్మన్‌లతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం- 2020 ప్రకారం లెటరల్ ఎంట్రీ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సులకు నూతన సిలబస్ రూపకల్పన చేయనున్నట్లు వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి వెల్లడించారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో వైవీయూ అకాడమిక్ డీన్ ఆచార్య చంద్ర ఓబుళరెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ వసుగోవర్ధన్‌రెడ్డి, వివిధ కోర్సుల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌లతో ప్రిన్సిపల్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా కొన్ని కోర్సులకు పాత సిలబస్, కొన్ని కోర్సులకు కొత్త సిలబస్ ఉందని తెలిపారు. అందరి అభిప్రాయాల మేరకు ఏకరూపంలో నూతన సిలబస్ రూపొందించాలని నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన సిలబస్ అమలు చేయనున్నామన్నారు. బీఓఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగులు సస్పెన్షన్

కడప నాగరాజుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సబ్ ఈఆర్‌ఓ కార్యాలయంలో అవినీతికి పాల్పడిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్వో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ యం.సుజిత్ విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చిన రూ.16,59,944 నగదును బ్యాంకులో సంస్థ అకౌంట్‌కు జమచేయకుండా అవినీతికి పాల్పడ్డారు. గత నాలుగు నెలల నుంచి అతనిపై పర్యవేక్షణ చేయనందుకు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ విజయబాబును సస్పెండ్ చేశామని తెలిపారు. సంస్థకు నష్టం కలిగించే పనులకు పాల్పడితే ఎంతటి వారైన శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్ఈ హెచ్చరించారు.

ఆటో ఢీ... వ్యక్తి మృతి



రంజయ్‌మెహతో మృతదేహం

మైలవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొడియం గ్రామ సమీపంలో నక్కవానిపల్లె వైపు వెలుతున్న రంజయ్‌మొహతో (43) అనే వ్యక్తిని ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొనడంతోమృతి చెందినట్లు ఎస్ఐరంతుల్లారెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన రంజయ్‌మెహతో సోలార్ కంపెనీలో కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. గురువారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఈఓఆర్‌డీ మృతి



మూరతోటి సుధాకర్ (ఫైల్‌ఫోటో)

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): మం డలంలోని వనిపెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న మూరతోటి సుధాకర్ శుక్రవారం తెల్లవా రుజామున గుండెపోటుతో మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.. సుధాకర్ గత ఐదేళ్లుగా మైదుకూరు మండలంలో పనిచేస్తున్నారు. ఆయన సొంత గ్రామమైన బద్వేలులో శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు



గాయపడ్డ అనంతపురంవాసులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్కాపురం వద్ద ఆటో బోల్తా పడడంతో 8 మందికి గాయాలయ్యాయి. అనంతపురం జిల్లాకు చెందిన 8 మంది శివభక్తులు మొక్కుబడి తీర్చుకునేందుకు ఆటోలో బయల్దేరి పోరుమామిళ్ల మీదుగా శ్రీశైలం వెలుతుండగా మార్కాపురం సమీపంలో గేదెలు అడ్డం రావడంతో వాటిని తప్పించబోయి బోల్తాపడింది. దీంతో ఆటోలోని 8 మందికి గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో లక్ష్మి నారాయణ, లక్ష్మినరసింహులు, సాకే నరసింహులు, పి.జయచంద్ర, లక్ష్మినరసింహులు, యశ్వంత్‌తో పాటు మరొకరు ఉన్నారు.

పురుగులమందు తాగి ఒకరు మృతి
మరొకరికి అస్వస్థత



విష్ణువర్ధన్ (ఫైల్)

చెన్నూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కు చెందిన విష్ణువర్ధన్ (31), లక్ష్మణ్ (35) అనే యువకులు వేర్వేరు కార ణాలతో శుక్రవారం పురుగులమందు తాగారు. వీరిలో విష్ణువర్ధన్ మృతి చెందగా, లక్ష్మణ్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరు భవానీనగర్‌కు చెందిన జింకా విష్ణువర్ధన్ స్థానికంగా ఓ సెల్‌పాయింట్ పెట్టుకుని జీవించేవాడు. వ్యాపారం సరిగ్గా జరగక రెండు నెలల క్రితం మూసివేశాడు. దీంతో అప్పులపాలు కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై శనివారం ముండ్లపల్లె రోడ్డులో పురుగులమం దు తాగాడు. అలాగే అతని స్నేహితుడు లక్ష్మణ్ సైతం మనస్థాపంతో పురుగులమందు తాగాడు. విష్ణువర్ధన్ ఇంటికి రాకపోవడంతో బంధువులు గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తించి కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందాడు. అలాగే లక్ష్మణ్‌ను కడప నగరంలోని ఓ ప్రైవే టు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్జీల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పని చేయాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పని చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో కలెక్టర్ అధ్యక్షతన బద్వేలు, కడప రెవెన్యూ డివిజన్ల పరిధిలోని రెవెన్యూ అధికారులకు రెవెన్యూ అంశాలు, వివిధ చట్టాలపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 80శాతం పైగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయన్నారు. ఇందుకు సంబంధించి కడప, బద్వేలు రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోల పరిధిలోని సర్వేయర్లు, వీఆర్వోలు, డిప్యూటీ తహశీల్దార్లు, తహశీల్దార్లకు రెవెన్యూ అంశాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. ఆయా మండల పరిధిలో తహశీల్దార్లు కూడా కార్యాలయ సిబ్బందితో రెవెన్యూ సమస్యలపై వర్క్ షాపు నిర్వహించుకోవాలన్నారు. మండలాల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి ఏ అంశాలపై అర్జీలు వచ్చాయో క్రోడీకరించుకోవాలన్నారు. అలాగే పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వేలో వచ్చిన అర్జీలను పరిశీలించి డూప్లికేట్ అర్జీలను తొలగించాలన్నారు. అర్జీలను నిశితంగా పరిశీలించి సమస్యలను తెలుసుకుంటూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు వారంలో 4 రోజుల పాటు గ్రామాల్లో విజిట్ చేయాలన్నారు. రెవెన్యూలో అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్ఓఆర్ పట్టాదారు పాస్ పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్ రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, గ్రామ సభలు, ఫ్రీహోల్డ్‌భూముల మానిటరింగ్ చేస్తున్నారని.. అందుకనుగుణంగా రెవెన్యూ సిబ్బంది నిబద్ధతో పని చేయాలన్నారు. సమా వేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో జాన్‌ఇర్విన్, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఏర్పాటు



వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైవీయూ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం విశాఖపట్టణం హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌తో వైవీయూ ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్, నేషనల్ మెంబర్ పి.దయాకర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా లభించే శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. సమావేశంలో పర్యావరణ శాఖ సహా ఆచార్యులు డాక్టర్ టి. చంద్రశేఖర్, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కడప జిల్లా ఆర్గనైజింగ్ కమీషనర్ జి.వెంకట సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి.... వ్యక్తిపై పోక్సో కేసు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఓ బాలికకు మాయ మాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన కుళాయప్ప అలియాస్ హర్ష అనే (23) యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ భావన తెలిపారు. ఈనెల 10 తేదీ నుంచి బాలిక ఇంటి నుంచి తప్పిపోయినట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈమేరకు గత రెండు రోజులుగా త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి ఆద్వర్యంలో పోలీసులు తీవ్రంగా గాలించి పట్టుకున్నారు. బాలికకు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసి మానసికంగా శారీరకంగా హింసించిన కుళాయప్పపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

20 మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

కడప కలెక్టరేట్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో వివిధ మండలాల్లో పని చేస్తున్న 20మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సంబంధిత విషయాలు, మ్యుటేషన్ తదితర సమస్యలు పరిష్కరించడంలో ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు అవినీతికి పాల్పడుతున్నట్లు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు 20 మంది సచివాలయ, రెవెన్యూ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. బద్వేలు మండలం తిప్పనపల్లి సెక్రటేరియట్ వీఆర్వో సాలమ్మ, చక్రాయపేట మండలం సురభి సెక్రటేరియట్ సర్వేయర్ విజయకుమార్, దువ్వూరు వీఆర్వో కె.మునిస్వామి, దువ్వూరు మండలం ఇడమడక వీఆర్వో హరియాదవ్, జమ్మమడుగు మండలం బి.బొమ్మపల్లి వీఆర్వో భీమన్న, కడప మండలం మామిళ్లపల్లి వీఆర్వో జహీర్ అబ్బాస్, ఉక్కాయపల్లి వీఆర్వో శ్రీనివాసులు, కలసపాడు మండలం ఎగువ రామాపురం వీఆర్వో కొండయ్య, పిడుగుపల్లి వీఆర్వో ఆనందరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రావు, కమలాపురం మండలం కోగటం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అర్జున్, లేటపల్లె వీఆర్వో వెంకట రామన్న, మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లి వీఆర్వో మధుడేవిడ్, మైలవరం మండలం తలమంచిపట్నం వీఆర్వో ఓబులేసు, రాజుపాలెం మండలం టంగుటూరు వీఆర్వో సరళ, వల్లూరు మండలం వీఆర్వో ఖాజీమొహిద్దీన్, వేంపల్లి మండలం రామిరెడిపల్లి వీఆర్వో ఓబయ్య, ఒంటిమిట్ట మండలం మంటపంపల్లి వీఆర్వో శ్రీనివాసులు, వేంపల్లి మండలం కథలూరు సర్వేయర్ బ్రహ్మయ్య, వేంపల్లి మండల సర్వేయర్ బ్రహ్మకుమార్‌రెడ్డిలు ఉన్నారు.

కువైత్‌లో వ్యక్తి మృతి

ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మపల్లి చిన్న ఓరంపాడు హరిజనవాడకు చెందిన రవికుమార్ (39) కువైత్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలం క్రితమే ఉపాధి కోసం కువైత్ వెళ్లాడని, అక్కడ సెంట్రింగ్ పనులు చేస్తుండగా లిఫ్ట్‌లోంచి జారి పడడంతో మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకురానున్నారని వివరించారు.


ఆలయాల్లో చోరీలకు పాల్పడే ఇద్దరి అరెస్టు

- రూ.12లక్షలు విలువచేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం



చోరీకి పాల్పడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను టార్గెట్‌గా చేసుకొని మధ్యాహ్న సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.12లక్షలు విలువచేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జమ్మలమడుగులో ఈనెల 5వ తేదీ నాగులకట్ట ఆలయంలో అమ్మవారి బంగారు, వెండి అభరణాలు చోరీ చేసినట్లు ఆలయ అధ్యక్షుడు జి.తిరుమలదాసు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా శుక్రవారం తాడిపత్రి రోడ్డులోని సాయిశివానీ కల్యాణ మండపం సమీపాన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో మోటారు సైకిల్‌పై వెళుతుండగా వారిని సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ సిబ్బంది పట్టుకున్నారని తెలిపారు. వీరిని విచారించగా పెద్దముడియం మండలం నెమళ్లదిన్నెకు చెందిన జంబులదిన్నె బాలక్రిష్ణ ప్రస్తుతం ప్రొద్దుటూరు శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్నారు. అలాగే చింతకాయల హుస్సేన్ బాషాగా గుర్తించారని తెలిపారు. వీరిని పూర్తి స్థాయిలో విచారణ చేయగా గత ఆరు నుంచి 7 నెలలుగా ఆలయాలను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడినట్లు తేలిందన్నారు. వారు మొత్తం 26 కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. ప్రస్తుతం వీరి వద్ద నుంచి 20 గ్రాముల బంగారు, 9.40 కేజీల వెండి ఆభరణాలు (ఆలయాల అమ్మవారి) స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మొత్తం వస్తువులు రూ.12 లక్షలు విలువ అవుతాయని తెలిపారు. విచారణలో సుమారు 26 కేసులకు సంబంధించి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కర్నూలు, యాడికి, బనగానపల్లి, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలిందన్నారు. పట్టుబడిన ఇద్దరి నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



CHANGE OF NAME
I, NOSSAM MARUTHI MAHESWAR REDDY (Old Name) R/at 6/174, POTLADURTHI, YERRAGUNTLA -516310, YSR KADAPA Dt, A.P, India. I have changed my name to NOSSAM MAHESWARA REDDY (New Name) S/o NOSSAM VENKATA NARAYANA REDDY
AJC-000

10th/INTER (NIOS)
MPC, Bi.P.C., M.Bi.P.C. C.E.C., H.E.C. కేవలం 5పేపర్లు మాత్రమే. Exams: October. SEA ACADEMY, Y-Junction, Kadapa. Cell : 99493 93809, 7674090494
Ajc-230625

CHANGE OF NAME
I, JAWAHARLA CHOWDHARY (OLD NAME) S/o. BAHADHURMAL CHOWDHARY, R/o. D.No.12/254, POTTI SREE RAMULU STREET, KADAPA, YSR Dt. 516001, ANDHRA PRADESH, INDIA, do hereby change my name to JAWAHARLAL CHOWDHARY (NEW NAME). Henceforth then now I maybe called as JAWAHARLAL CHOWDHARY.
AJC-000

బంగారం కొనబడును
మీబంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులోవున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 226814

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



ఎట్టకేలకు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

● పెండింగ్ పనులన్నీ పూర్తిచేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేంపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన వృషభాచలేశ్వర ఆలయం నెలకొని ఉన్న ఎద్దులకొండ రోడ్డుకు రూ.1.19కోట్ల ఈపీపీ నిధులతో తారురోడ్డు నిర్మాణానికి శుక్రవారం టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి భూమిపూజ చేశారు. జనవరి 19వ తేదీన గుంతలమయం ఎద్దల కొండ రోడ్డు, భక్తు లు పడుతున్న అవస్థల గురించి ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. స్థానిక నాయకులు టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లగా గతంలో మంజూరై పనులు చేయని ఎద్దల కొండ రోడ్డు విషయం ఉన్నతాధికారులతో మాట్లాడి తిరిగి మం జూరు చేయించారు. శుక్రవారం ఎద్దల కొండ వద్ద టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దల కొండ్రాయుడు, మాజీ సభ్యులు పి.వి రమణ, పీఆర్ డీఈ సుధాకర్‌రెడ్డి, ఈఓ విశ్వనాథరెడ్డి తదితరులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జగన్నాథరెడ్డి, పులివెందుల పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, యువనాయకులు రజనీకాంత్‌రెడ్డి, షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, నల్లగారి కృష్ణారెడ్డి, బాలం వెంకటసుబ్బయ్య, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వల్లి, ఎద్దుల రామచంద్ర, నామా వేమకుమార్, భాస్కర్, మైనార్టీ ఉపాధ్యక్షులు అల్లాబకాష్, కుమ్మరాంపల్లె భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎద్దుల కొండ రోడ్డుకు భూమిపూజచేసి పనులు ప్రారంభిస్తున్న రఘునాథరెడ్డి టీడీపీ నేతలు

'కమ్మ సంఘాల జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారాలు చెల్లవు'

కడప మారుతీనగర్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కమ్మ సంక్షేమ సంఘం ఐక్యతను దెబ్బతీసేలా కడప జిల్లాలోని కమ్మ వర్గీయులు రెండు వర్గాలుగా విడిపోయి జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారాలకు వేర్వేరుగా సిద్ధపడడం సరి కాదని, ఆ ప్రమాణ స్వీకారాలు చెల్లవని కడప జిల్లా కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న చల్లా ప్రభాకర్‌నాయుడి వర్గం, 16న పల్లినేని నాగేశ్వరరావు వర్గం కడపలోని కమ్మ సంక్షేమ సంఘం భవనంలో వేర్వేరుగా జిల్లా కార్యవర్గ ఎన్నిక ప్రమాణ స్వీకారం చేసేలా సమాయత్తమయ్యాయన్నారు. ఇరువర్గాల ప్రమాణ స్వీకారాలు చెల్లవన్నారు. ఉమ్మడి కడప జిల్లా కమ్మ సంక్షేమ సంఘం శాశ్వత సభ్యులందరితో చర్చించి ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

నేడు నగరంలో స్కూటర్ ర్యాలీ



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మరాఠా వీర యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఛత్రపతి శివాజీ మరాఠా సేవా సంఘ్, ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 7 గంటలకు నగర బిల్టప్ సమీపంలోని మాతా అంభా భవాని ఆలయం నుంచి శోభాయాత్ర జరగనుందని ఆ ఐక్యవేదిక గౌరవాధ్యక్షులు అంబారపు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శోభాయాత్ర నగర 2వ గాంధీ విగ్రహం, గోకుల్‌సర్కిల్, 7రోడ్లు, ఎన్జీఓ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, కాగితాల పెంట, నబీకోట్, మరాఠా వీధి మీదుగా తిరిగి అంభా భవాని ఆలయం వద్దకు చేరుకుంటుందన్నారు.శోభాయాత్రలో భాగంగా నగరంలో ఈనెల 15 ఉదయం 9 గంటలకు అంబా భవానీ ఆలయం నుంచి స్కూటర్ ర్యాలీ జరుగనుందన్నారు. సమావేశంలో నాయకులు భారవి, వర్మ, లక్ష్మీనారాయణ రెడ్డి, శోభాబాయి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పుల్వామా అమరవీరులకు జోహార్లు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ టీడీపీ ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిలో అసువులుబాసిన భారత జవాన్లకు ఎర్రముక్కపల్లె సైనిక్ కూడలి వద్ద టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, టీడీపీ నగర ఉపాధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, బిల్లా నవీన్‌లు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మంజునాథ్, ఆసిఫ్, వెంకటేష్, దలీప్, అబ్దుల్, శివారెడ్డి, సుదీప్‌రాయల్, ఫాజిల్ పాల్గొన్నారు.

కడపలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి అన్నారు. శుక్రవారం ద్వారకనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. గత, ప్రస్తుత కార్పొరేషన్ పాలకవర్గం నిర్లక్ష్యంతో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయన్నారు. మంచినీటి శాశ్వత పరిష్కారం కోసం కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్, నీటిపారుదల అధికారులతో సమీక్షించానన్నారు. ప్రతిరోజు నీరు వచ్చేలా ప్రణాళికలను రూపొందించామని చెప్పారు. రోజు నీళ్లు దిలేలా శనివారం 13 డివిజన్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తున్నామన్నారు. భాగ్యనగర్ కాలనీలో ఉదయం 8గంటలకు నీరు విడుదల చేస్తామన్నారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ,మైనార్టీ నగర అధ్యక్షుడు ఖాజాపీర్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16వ తేదీన జరిగే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాలో సుమారు 5702 ఉద్యోగాలు ఉన్నాయన్నారు.

విద్యార్థులంటే అంత అలుసా : ఏఐఎస్ఎఫ్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కులను ప్రశ్నిస్తే రాద్ధాంతం చేయొద్దని రిజిస్ట్రార్ పద్మ చెప్పడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వైవీయూ వీసీ చాంబర్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు మాట్లాడుతూ 2025 జనవరి 7న వైవీయూ అధికారులు లేటరల్ ఎంట్రీ అనుమతి ఉందంటూ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు పర్మిషన్ ఇస్తున్నామని ప్రకటన కూడా విడుదల చేశారన్నారు. యూనివర్సిటీ అధికారులకు ప్రభుత్వ కళాశాల అనుమతి ఇవ్వడానికి శ్రద్ధ ఎందుకు లేదన్నారు.

వీరులారా.. మీ త్యాగం మరువలేం



పుల్వామా ఉగ్రదాడిలో వీరజవాన్లకు నివాళిగా ట్రిపుల్‌ఐటీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వేంపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో వీరజవాన్లకు నివాళిగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధ్వర్యంలో బ్లాక్‌డే



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వికాస్ హైస్కూల్ విద్యార్థులు, కరస్పాండెంట్ హరికృష్ణ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్కాయపల్లె వికాస్ హైస్కూల్లో ఫిబ్రవరి 14ను బ్లాక్‌డేగా నిర్వహించారు. అమరులైన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు కొవ్వొత్తులు వెలిగించి 'జైజవాన్, జైజవాన్' అంటూ నినాదాలు చేస్తూ నివాళులు అర్పించారు. స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఇదో చీకటి రోజన్నారు. భారత భద్రతా బలగాలపై ఉగ్రవాదులు అత్యంత ఘోరమైన దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ దాడుల్లో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు దేశ రక్షణలో అమరులయ్యారని, 2019 ఫిబ్రవరి 14న మధ్యాహ్నం జైషే మహమ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడులకు తెగబడ్డారని గుర్తు చేశారు. ఆ తర్వాత భారత్ ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి వందలాది మంది ఉగ్రవాదులను మట్టుబెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఫాతిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అందరికీ నాణ్యమైన ఆహారం



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన ఆహారం అందిస్తున్నారని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్సీ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలోని ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కోడిగుడ్డును అక్కడే తూకం వేయించారు. బరువు తక్కువ ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో తాగునీటికి ఇబ్బంది ఉందని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా వెంటనే ఆర్వోప్లాంటు ఏర్పాటు చేసేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జ మైసూరారెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం..విజయదుర్గా-మల్లికార్జునుల కల్యాణం





ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు.. అమ్మవారికి మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు





విజయదుర్గాదేవి ఊరేగింపులో భాగంగా అలరించిన కళాకారుల సందడి.. పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విజయదుర్గా-మల్లికార్జునుల కల్యాణం శుక్రవారం నయనానందకరంగా జరి గింది. జగన్మాత విజయదుర్గాదేవి ఆలయం 23వ వార్షిక బ్ర హ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదుర్గాదేవి కడపలో కొలువుదీరిన పర్వదినం మాఘ బహుళ విదియ సందర్భంగా 25 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ యాగశాలలో గణపతి, నవగ్రహ, చండీహోమం నిర్వహించారు. మండపంలో నవావరణశ్రీచక్రార్చనలు అత్యం త భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 10.30 గంటలకు అమ్మవారికి సుమంగళి పూజ, మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో భక్తిపాటలు ఆలపించారు. అనం తరం ముత్యాల తలంబ్రాలు, పండితుల మనోహర వ్యాఖ్యానాలు, వేద మంత్రాల నడుమ కల్యాణం నయనానందకరంగా సాగింది. రాత్రి అమ్మవారు సింహ హవాహనంపై ఊరేగింపునకు బయలుదేరారు.

నేడు పుష్పయాగం

ఆలయంలో శనివారం మహా పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, త్రిశూల స్థానం, పుష్పయాగం జరగనున్నట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి హామీ అవినీతిపై
సిబ్బందిని హెచ్చరించాం



కె.కుళాయమ్మ, ఎంపీడీఓ, వేంపల్లె

వేంపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలంలో ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవినీతిపై నిందితులను హెచ్చరించామని ఎంపీడీఓ కుళాయమ్మ తెలిపారు. పనికి హాజరు కాకున్నా మస్టర్లు వేయడం, మైనర్ల పేరుతో మస్టర్లు రాయడం వంటి అవకతవకలకు పాల్పడుతున్న సిబ్బందిని మందలించామన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆ వివరాలు తెలిపారు.

ప్రశ్న: ఉపాధి హామీలో అవకతవకలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ఉపాధి హామీ పథకం కింద కుప్పాలపల్లె, ఇడుపులపాయ తదితర గ్రామాల్లో మైనర్లు పనికి వచ్చినట్లు, పనిచేయని వారికి కూడా హాజరు వేసినట్లు నా దృష్టికి రాగా ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్, సిబ్బందిని హెచ్చరించా. వారి జాబ్‌కార్డులను తీసేశాం. ఇలాంటి అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

ప్రశ్న: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. వేంపల్లెలో దారుణంగా ఉంది. మీ చర్యలు ఏమిటి?

జవాబు: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య మెరుగునకు కార్యదర్శులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నాం. ప్రతి మూడవ శనివారం క్లీనింగ్ డే ఏర్పాటు చేస్తున్నాం. పల్లెల్లో చాలా వరకు దిబ్బలు లేకుండా తొలగిస్తున్నాం. వేంపల్లెలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్న మాట వాస్తవమే. సిబ్బంది కొరత వల్ల ఇబ్బంది వస్తోంది. ఉన్నవారికి అదనంగా మరింత శాలరీ ఇచ్చి పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: మండలంలో వేసవి తాగునీటి సమస్య ముందస్తు చర్యలు ఏమైనా చేపట్టారా?

జవాబు: తాగునీటి సమస్య ఎక్కడున్నా పరిష్కరించేందుకు సరిపడా పంచాయతీల్లో నిధులు ఉన్నాయి. ఇప్పటికే ఎక్కడైన నీటి సమస్య ఉంటే గుర్తించాలని కార్యదర్శులకు చెప్పాం. వేంపల్లె టౌన్‌లో కొన్ని ప్రాంతాలకు పాపాఘ్ని నీరు అందడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. బోర్లు వేయించి నీటిని సరఫరా చేయించేందుకు కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వేంపల్లెలో ఆధార్ అప్‌డేట్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు

జవాబు: వేంపల్లె పట్టణంలోని రెండు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పని చేయడం లేదు. ఇడుపులపాయ, కత్తలూరు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. పట్టణ జనాభా ఎక్కువ. ఇక్కడ ఎక్కువ మందికి ఆధార్ సమస్యలు ఉన్నాయి. ఉన్నతాధికారులతో మాట్లాడి వేంపల్లె పట్టణంలో రెండు కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తాం.

ప్రశ్న: సబ్సిడీ రుణాలను అర్హులందరికీ అందిస్తారా?

జవాబు: మండలానికి మంజూరైన అన్ని కేటగిరీల సబ్సిడీ రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలు ఇచ్చాం. గడువు ముగిసిన తర్వాత బ్యాంకర్లతో మాట్లాడి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం. లోన్ తీసుకున్న వ్యక్తి సంబంధిత యూనిట్ ఏర్పాటు చేసే వారికే మంజూరు చేస్తాం. రుణ మం జూరు ఎక్కువగా బ్యాంకర్ల మీద ఆధారపడి ఉంటుంది.



ఏపీ దేవాంగ సంక్షేమ సంఘంలో చీలికలు తేవద్దు



మాట్లాడుతున్న దేవాంగ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :ఏపీ దేవాంగ సంక్షేమ సంఘంలో చీలికలు తెచ్చి నూతనంగా ఏర్పాటవుతున్న మరో సంఘం తో ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని తాము ఆ సంఘంలో భాగస్వామ్య సంస్థగా వున్నట్లు వారు కరపత్రంలో వేసుకోవడం సరైనదికాదని ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉట్టినాగశయన ఖండించారు. శుక్రవారం స్థానిక దేవాంగ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాంగ సంఘం ను రెండుగా చీల్చేందుకు కొందరు అంతర్గతంగా కుట్రపన్ని దేవాంగ కులాన్ని ఐక్యంగా లేకుండా విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కొందరు విచ్ఛిన్న కరశక్తుల మాటలు విని దేవాంగ సంఘంలోని విజయవాడ, రాజమండ్రిలోని పెద్దలు ఈ కొత్త సంఘం ఏర్పాటు ప్రయత్నించటం సరికాదన్నారు. సమావేశంలో దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, ఉట్టి లక్ష్మీనారాయణ దేవాంగ కళ్యాణమండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేకర, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న పీఎండీ నజీర్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాను నివారించడానికి సన్నబియ్యం పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పీఎండీ నజీర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రం నుంచి రేషన్ బియ్యం పెద్ద ఎత్తున విదేశాలకు, పక్కరాష్ట్రాలకు అక్రమంగా రవాణా అవుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యాన్ని 60 శాతం మంది పేద ప్రజలు విక్రయిస్తున్నారని, ఆ బియ్యాన్ని మిల్లుల్లో సైక్లింగ్ చేసి సాధారణ బియ్యంలో కలిపి కల్తీ చేస్తున్నారని ఆరోపించారు. కొందరు మిల్లర్లు రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి ప్రజలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొంటున్నారు. రెవెన్యూ అధికారులు ఎన్ని దాడులు చేసినా రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటంలేదన్నారు. ఈ సమావేశంలో ఖాజా పేర్కొన్నారు.

పాత పద్ధతిలోనే స్కానింగ్ నిర్వహించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పాత పద్ధతిలోనే రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎంఆర్ఐ, సిటీస్కానింగ్‌లు నిర్వహించాలని సీపీఎం నాయకులు శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ రోజుకు వెయ్యి మంది ఓపీలో చూపించుకుంటున్నారని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ అనాలోచిత నిర్ణయంతో వారం రోజులుగా ఎంఆర్ఐ, సిటీస్కానింగ్‌లను నిలిపివేయడంతో రోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విజయకుమార్, రవి, బాల సుబ్బయ్య, ఓబులేసు, విశ్వనాథ్, మేరిబాబు, చంద్రాయుడు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం వసంతపేటకు చెందిన పల్లా శ్రీనివాసులు (51)అనే వ్యక్తి అనారోగ్యంతో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. పల్లా శ్రీనివాసులు కుమారుడు హరీశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పల్లా శ్రీనివాసులుకు ఐదేళ్ల క్రితం పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. అప్పటినుంచి మానసికంగా వ్యథ చెందేవాడు. గురువారం ఇంట్లో బాత్‌రూంకని వెళ్లి ఎంతకూ రాకపోయే సరికి తలుపులు పగుల గొట్టి చూడగా తండ్రి శ్రీనివాసులు ఒంటిపై కిరోసిన్ పోసుకోని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆమేరకు ఒన్‌టౌన్‌పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

PUBLIC NOTICE

Under the Instructions Of my client M/s Shriram finance ltd. Kadapa-2 branch issues the following notice to the general public. My client intend to grant loan to Sri SRIYAPUREDDY @ PERAM KAVITHA D/o SRIPUREDDY CHINNAPU REDDY w/o PERAM JAGAN MOHAN REDDY residing at D.no: 1/21,ALAVALAPADU. KADAPA dt. by mortgage. As such If anyone has any claims, objections charges or mortgages, sale agreement court attachments court disputes shall be informed to the address mentioned below In within 7 days from the date' of this notice, otherwise matter objections will not bind on my client in the regard. SCHEDULE Of THE PROPERTIES : Y.S.R KADAPA DIST. MYDUKUR SUB-DIST. CHAPADU MDL. CHIYYAPADU VIL. AND VIL. FIELDS, THE LAND IN SY.NO. 605 TO THE TOTAL EXTENT OF AC. 04-21 CENTS, OUT OF WHICH AN EXTENT OF AC. 04-21 CENTS IN WHICH AN EXTENT OF AC. 02-11 1/2 CENTS OR 0.856 HECTORS IS BOUNDED AS FOLLOWS. BOUNDARIES : EAST : LAND OF SRIYAPUREDDY RAMAKRISHNA REDDY, WEST : MAIN ROAD IN SY.NO. 606, NORTH : LAND OF HARIJANAWADA IN SY.NO. 604, SOUTH : LAND OF R. SARASWATHI WITHIN THESE BOUNDARIES THE ABOVE SAID PROPERTY TO AN EXTEN OF AC. 02-11 1/2 CENTS IS SITUATED WITH ALL EASESMENT RIGHTS

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

PUBLIC NOTICE

Under the Instructions Of my client M/s Shriram finance ltd. Kadapa-2 branch issues the following notice to the general public. My client intend to grant loan to Sri Ammireddy Sarada w/o Sanjeeva Reddy residing at D.no: 6/288-1, Reddynagar Street, Proddatur Road, Mydukur, Kadapa District by mortgage. As such If anyone has any claims, objections charges or mortgages, sale agreement court attachments court disputes shall be informed to the address mentioned below In within 7 days from the date' of this notice, otherwise matter objections will not bind on my client in the regard. SCHEDULE Of THE PROPERTIES: YSR KADAPA DIST. MYDUKUR SUB-DIST. MYDUKUR MDL. MYDUKUR GRAMA PANCHAYATH, S. MYDUKUR VILLAGE FIELDS, 14TH WARD, MAIN RESIDENTIAL AREA IN SAIBABA TEMPLE STREET, THE VACANT SITE SITUATED IN SY.NO. 88 TO THE TOTAL EXTENT OF AC. 0-13 1/2 CENTS OR 0.054 HECTORS IS BOUNDED AS FOLLOWS. BOUNDARIES : EAST : VACANT SITE OF DR. KOPPARTHI NARAYANA REDDY, WEST : KADAPA - KURNOOL NH - 18 ROAD, NORTH : 28 FEET WIDTH RASTA, SOUTH : VACANT IS IN PLOT BELONGS TO WIFE OF ATLURI KOTHAPALLE OBULA REDDY. MEASUREMENT OF VACANT SITE : EAST-WEST : ON NORTH SIDE 107.30 FEET OR 12.05 METERS, ON SOUTH SIDE 62.5 FEET OR 18.09 METERS, NORTH - SOUTH : ON EAST SIDE 72 FEET OR 21.81 METERS, ON WEST SIDE 85 FEET OR 25.75 METERS.

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Jammalamadugu branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Vemareddy Nagendra s/o Sri V Chandrasekhar** residing at Dno:-2/374, Water Tank Street, Muddanur Road Jammalamadugu, YSR dist by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. SHEDULE OF THE PROPERTIES: YSR dt Jammalamadugu Registration sub dt, Jammalamadugu Mandal Jammalamadugu Nagara Panchayath and Village Field Residential Vacantsite Situated at SY No : 586/13, Block NO-04 Nearby D/no-4/53-63A Diguvapatnam Colony An Extent of 2.0 Cents or 96.8 Sq Yards with in the following **Boundaries :** EAST : SITE OF TEACHER NAGARAJU. WEST : SITE OF YERRAGUDI ABDUL KHADAR NORTH : RASTHA. SOUTH :PLOT SOLD BY SEENAIAH SWAMY.

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Mydukur branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Kanchamreddy Subhash Kumar Reddy s/o Sri Venkata Subbareddy** residing at Dno:-8/14,K Kotha Palle, Ga, Muddanur, YSR dist by mortgage. As such if anyone has any claims ,objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard

SCHEDULE OF THE PROPERTIES : YSR dist Kamalapuram Registration sub district, Yerraguntla Mandal Yerraguntla Nagara Panchayath and Village Field Residential Vacant site Situated at SY No : 337/1, Plot-NO-11&12Vinayaka Nagar Near Proddatur Road An Extent of 9.0 Cents or 435.70 Sq Yards with in the following **Boundaries :** EAST : PLOT NO-13, WEST : 15'0 WIDE RASTHA, NORTH :SITE IN PLOT NO-10, SOUTH : CEMENT ROAD.

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

పరిహారం అందించండి

హైవే బాధితుల ఆవేదన



ఆర్డీవో సాయిశ్రీకి సమస్యలు తెలుపుకుంటున్న నేషనల్ హైవే బాధితులు

ముద్దనూరు ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఇళ్లకు పరిహారం అందించాలని కమ్మవారిపల్లెకు చెందిన నేషనల్ హైవే రోడ్డు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో సాయిశ్రీ కి బాధితులు సమస్యలను విన్నవించుకున్నారు.తమకు పరిహారం ఇవ్వకుండా ఇళ్లను కూల్చేందుకు కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారన్నారు. అందుకు ఆర్డీవో వివరిస్తూ ప్రభుత్వ స్థలంలో ఇళ్లు ఉన్నాయని, స్థలానికి పరిహారం ఇవ్వరని, అక్కడున్న ఇంటికి సంబంధించిన వాటికి పరిహారం ఇస్తారన్నారు.ఎంత పరిహారం వచ్చేది నేషన్ హైవే వారు తెలియజేస్తారన్నారు.బాధితులకు పరహారం ఎంత వస్తుందో తెలపాలని నేషనల్ హైవే ఏఈ సురేంద్రనాథరెడ్డికి సూచించారు.అలాగే ఇళ్ల వద్ద నున్న పాత బ్రిడ్జి కింద కొండ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని హైవే అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎర్రగుంట్లలోని అర్బన్, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లో ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, జోత్స్న, ఇతర అధికారులు లక్ష్మయ్య, రవిశంకర్, ఓబులేసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు..: సిమెంట్ ఫ్యాక్టరీలలో పనిచేసేవారికి దుమ్ము-ధూళి వల్లే క్షయ వాధి వస్తుందని పీహెచ్‌సీ వైద్యులు జోత్స్న తెలిపారు. శుక్రవారం జువారి వైద్యులు నరసింహారెడ్డి, శ్రీలతల ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్ వైజర్ ఓబులేసు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఈవోగా శ్రీనివాసులు

చాపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయం ఈవోగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఈవో మారుతీప్రసాదు సెలవులో వెళ్లిపోయారు. 26న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శ్రీనివాసులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చిన్నస్వామి, రామగోవింద, నరేంద్రస్వామి, భరత్‌స్వామి పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ సుల్తాన్‌బాబా ఉరుసు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో శుక్రవారం హజరత్ సుల్తాన్‌బాబా ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావారి దర్గా ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రి భక్తులు విశేషంగా పాల్గొని దర్గాలో ఫాతెహాలు చేసి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ చౌడేశ్వరీదేవి బృందం వారు కోలాటం నిర్వహించారు. దర్గా ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఉరుసు ఉత్సవంలో స్థానిక పెద్దలు, దర్గా కమిటీవారు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన



హెడ్‌పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ శాఖ ప్రైవేటీకరణకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఎఫ్ఎన్‌పివో సర్కిల్ డేవిడ్ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద గేట్ మీటింగ్ పెట్టి పోస్టల్ డిపార్ట్ మెంట్ ప్రైవేటీ కరణ కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్రప్రభుత్వం ఇదే తరహా యత్నాలను కొనసాగిస్తే ఫిబ్రవరి 18 నుంచి 20 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. మార్చి 18నుంచి నిరవధిక సమ్మెలోకి వెళతామన్నారు. ఈకార్యక్రమం లో రీ పోస్టుమాన్ ఎంటీఎస్ కర్నూలు రీజియన్ గురుశంకర్, డివిజన్ అధ్యక్షుడు జిలానీ బాషా,సెక్రటరీ జయన్న పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళులు



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా దాడిలో 2019 సంవత్సరంలో అమరులైన వీరజవాన్లను స్మరించుకుంటూ ఎస్వీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ మాట్లాడుతూ పుల్వామా దాడిలో ఫిబ్రవరి 14న శత్రువుల వెన్నుపోటుతో 40 మంది సైనికులు వీరమరణం పొందారని, అందువలన ఈ రోజును బ్లాక్‌డేగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, ప్రిన్సిపాల్ ముస్తఫా, ఎన్‌సీసీ ఇన్‌స్పెక్టర్ దావీదు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే కంటి సంరక్షణ



మైలవరంలో విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేస్తున్న భూపేశ్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం తీసుకోవడం వలనే కంటిని సంరక్షించుకోవచ్చునని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో జిల్లా అంధత్వ నివారణ సంఘం ద్వారా 138 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. వైఎంఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు ,ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫసీర్ వెంకటేశ్వర్లు, పీవో సుబ్బారెడ్డి, ఆశా, ఏఎన్ఎం, ఇన్‌చార్జి హెడ్మాస్టర్ గోవర్ధన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం..: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. గతంలో పరీక్షలు నిర్వహించిన 40 మంది విద్యార్థులకు మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మలేరియా జోనల్ ఆఫీసర్ లక్ష్మణ్‌నాయక్, మెడికల్ ఆఫీసర్ సుజాత, ప్రిన్సిపాల్ కృష్ణవేణి పాల్గొన్నారు.

మైలవరం..: మండల కేంద్రంలో ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 70 మంది విద్యార్థులకుజమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటివైద్యులు సత్యనారాయణ, మైలవరం డాక్టర్ చంద్రకుమార్, హెచ్ఎం సావిత్రి, సూపర్‌వైజర్ రామ్మోహన్, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మోటారు బైకుల దొంగలు..?

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు దొంగిలించిన వారిని పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ద్విచక్ర వాహన దొంగలపై నిఘా ఉంచి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇంకా వారి నుంచి అదనపు సమాచారం కోసం విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు. పంచాయతీలో శీనప్ప బావివీధి వద్ద మోటారు చెడిపోవడంతో ఆయన వాటిని మరమ్మతులు చేయించారు.

ముఖ్యమంత్రిని కలిసిన రితేశ్‌రెడ్డి



బద్వేలుటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్య మంత్రి చంద్రబాబును బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్ కుమార్‌రెడ్డి శుక్రవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలుసుకు న్నారు. అనంతరం నియోజ కవర్గ అభివృద్ధి చేపట్టాల్సి న అంశాలపై చర్చించినట్లు ఆయన తెలి పారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి కోసం పలు ప్రతిపాద నలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన పేర్కొ న్నారు. ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిం చి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పట్టణంలో శనివారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ లైన్లలో మెంటెనెన్స్ ఉన్నందున ఎర్రగుంట్ల పట్టణంలోని ముద్దనూరు, కడప , వేంపల్లిరోడ్డు, రాజీవనం, వినాయకనగర్, సుందరయ్యనగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఏస్టేట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

బీసీ బాలికల పాఠశాలలో చేరేందుకు

దరఖాస్తు ఆహ్వానం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను ప్రవేశ పరీక్ష పద్ధతి ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జమ్మలమడుగు మహాత్మాజ్యోతిరావుపూలే విద్యాసంస్థ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేవారు. ప్రవేశ పరీక్ష పద్ధతి ద్వారా జూనియర్ ఇంటర్మీడియట్, 5వ తరగతి ప్రవేశం, బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు (6, 7, 8, 9 ఇంగ్లీషుమీడియం)లో ప్రవేశానికి బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. స్టేట్ సిలబస్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థుల నుంచి ప్రవేశానికి దరఖాస్తులు కోరడమైందన్నారు. దరఖాస్తులను ఈనెల 15వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. ఇతర సమాచారానికి 9989866852, 9010440416 నంబర్లను సంప్రదించాలన్నారు.

గురుకుల పాఠశాలలో చేరేందుకు...

బి.కోడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాలలో ఆసక్తి ఉన్న విద్యార్థులు చేరేందుకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌ప్రసాద్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను 5వతరగతి,ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ,ఎంపీసీ లో ప్రవేశం కోసం 6వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తామని వారు తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు 2, రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. వివారలకు పాఠశాల ప్రిన్సిపాల్ 9441934164 నెంబరుకు ఫోను చేసి సంప్రదించాలని వారు కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు...

బద్వేలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు చెందిన వారికి మెప్మా ఆధ్వర్యంలో నేషనల్ అప్రెంటీస్ ట్రైనింగ్ స్కీం (నాట్స్) ఆశ సొసైటీ వారిచే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నట్లు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు స్టైఫండ్‌గా రూ.3,500 అందజేయబడుతుందన్నారు. దరఖాస్తు దారులు 2021 తర్వాత ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఈ నెల 20వ తేదీలోపు మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7901610301నెంబరును సంప్రదించగలరని ఆయన తెలిపారు.

కృష్ణాబోర్డు తరలింపు ఆపాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణాబోర్డును విశాఖ పట్నంకు తరలించాలని జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు నేడు విజయవాడకు తరలించడం తగదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ రైతులు, రైతు సంఘ నాయకులు, నీటిపారుదల నిపుణులు కృష్ణాబోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కృష్ణాబోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, భాస్కర్, పీటర్, రాహుల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అట్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో సొంత భూమి కలిగిన ప్రతి రైతూ ప్రభుత్వ పథకాలు అందాలంటే విశిష్ట గుర్తింపు నెంబరు కోసం రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా తమ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో రామక్రిష్ణ శుక్రవారం తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యంత్ర పరికరాలు సబ్సిడీపై పంటల బీమాపై రాయితీ, సూక్ష్మ పోషకాలు, పెట్టుబడి సాయం, సూక్ష్మసేద్యం తదితర పై రాయితీ పథకాలు ప్రభుత్వం నుంచి వర్తించాలంటే రైతులు తప్పనిసరిగా వారి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కు అనుసంధానం చేయబడిన మొబైల్ నెంబరును రైతు సేవా కేంద్రంలో పనిచేసే అగ్రికల్చర్ అసిస్టెంటును సంప్రదించాలని ఆయన తెలిపారు.

సెమిస్టర్ ఫలితాల్లో నాగభూషణం కళాశాల విద్యార్థుల ప్రతిభ



బద్వేలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో రాచపూడి నాగభూషణం డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభను చూపి సెమిస్టర్ ఫలితాలలో మొదటి స్థానంలో నిలిచారని కళాశాల పరిపాలాధికారి రాచపూడి సాయిక్రిష్ణ తెలిపారు. మొత్తం 13 గ్రూపులకు గాను 12 గ్రూపులలో యూనివర్సిటీ ఫస్ట్‌గా నిలిచి అన్ని గ్రూపుల నుంచి మొదటి సెమిస్టర్‌లో 11 మంది విద్యార్థులు 10కి10 పాయింట్లు సాధించారని ఆయన తెలిపారు. 50 మంది విద్యార్థులు 9.0 పైగా ఎస్‌జీపీఏ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరాయల్



బద్వేలు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దర్శిశెట్టి శ్రీనివాసరాయల్ (అశోక్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కొన్నేళ్లుగా కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మార్కెట్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన తనను తిరిగి మళ్లీ ఎన్నుకున్నారన్నారు.



వెటర్నరీ విద్యార్థులకు రూ.60వేలు స్టైఫండ్ చెల్లించాలి



మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థులకు రూ.60 వేలు స్టైఫండ్ చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. పశువైద్య విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసనలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా వెటర్నరీ కళాశాల విద్యార్థులకు రూ.7 వేలు స్టైఫండ్ చెల్లిస్తున్నారని, పెరిగిన ధరలతో అది వారికి సరిపోదన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇచ్చినట్లు రూ.60 వేలు స్టైఫండ్ చెల్లించాలని కోరారు. మంత్రి అచ్చెంనాయుడు వెటర్నరీ విద్యార్థుల సంఘాన్ని చర్చలకు పిలువడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని లేదంటే వారికి మద్దతుగా ఆందోళనను ఉధ్రుతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల మద్దతు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలని పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మెకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య, భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. పశువైద్యకళాశాల విద్యార్థులు చేపట్టిన 12వ రోజు సమ్మెలో భాగంగా శుక్రవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు.

చికిత్స పొందుతూ

మహిళ మృతి

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):బ్రహ్మంగారిమఠం మండలంలోని దిగువ నేలటూరు గ్రామానికి చెందిన కె.సుబ్బమ్మ (54) అనే మహిళ ఇటీవల ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ అయి ప్రమాదానికి గురి కావడం జరిగింది. వైద్యం నిమిత్తం కడప ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఉంది. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆమె భర్త సుబ్బయ్య తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు బ్రహ్మంగారిమఠం మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లిసుబ్బారెడ్డి, మేకల సుధాకర్, చిలమల నాగయ్య, గంగరాజు, మాజీ సర్పంచ్ మన్యం రవిశంకర్‌రెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.